క్లుప్తంగా

సన్మానం



జనగామ: తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్‌ను మంగళవారం జనగామ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. జనగామ మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, జేడీబీఏ అధ్యక్షుడు గోపగోని సుగుణాకర్, న్యాయవాది కూకట్ల మల్లయ్య, యుదవ సంఘం అధ్యక్షుడు కానుగంటి శేఖర్, జేబీఎస్ సభ్యులు వినోద్‌బాబు, హరీష్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం



నర్మెట: ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నీరటి మురళి (47) ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కాగా, జిల్లా నాల్గో తరగతి ఉద్యోగ సంఘం నాయకులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.11 వేల ఆర్థిక సాయంతోపాటు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. పరామర్శించిన వారిలో సంఘం బాధ్యులు సత్యం వివేక్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఘనంగా మహావీర్ జయంతి



జఫర్‌గఢ్: మండల కేంద్రంలో సర్పంచ్ బల్లెపు నర్సింగరావు ఆధ్వర్యంలో మహావీర్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం దర్వాజ వద్ద ఉన్న మహావీర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు మాట్లాడుతూ జైన మతస్థాపకుడు మహావీర్ జయంతి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, ఉపసర్పంచ్ నంచర్ల లత యాదగిరి, వార్డు సభ్యులు ఎండి యాకుబ్, కుల్లా రాజు, తోట రమేష్, ఎండి మహబుబ్‌అలీ, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తల్లి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే అరూరి



జఫర్‌గఢ్: మండలంలోని ఉప్పుగల్లు గ్రామ నివాసి వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం స్వగ్రామానికి వచ్చి తల్లి వెంకటమ్మ ఆశీర్వాదం తీసుకున్నారు. తల్లి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

బోర్ పనులు ప్రారంభం

లింగాలఘణపురం: మాణిక్యాపురంలో మంగళవారం ఎల్లమ్మగుడి వద్ద మండల పరిషత్ నిధులు రూ.2.40 లక్షలతో బోర్ పనులను ఎంపీపీ జయశ్రీ ప్రారంభించారు. సర్పంచ్ శ్వేతపూర్ణచందర్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వనపర్తిలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు రూ.55 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ వంశీధర్‌రెడ్డి పరిశీలించారు. సర్పంచ్ శ్రీధర్, ఎంపీటీసీ రాజిరెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

చిల్పూరు: మండలంలోని లింగంపల్లిలో ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా సోమవారం రాత్రి బలగం సినిమా ప్రదర్శన ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన కిన్నెర పరుశరాములు సినిమా చూసేందుకు వస్తూ కాలుజారి పడిపోవడంతో చేతికి గాయమైంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ 108 వాహనానికి సమాచారం అందించారు. పరుశరాములుకు సర్పంచ్ రూ.1,000 ఆర్థిక సాయం అందజేయగా, కోలాట కళాకారుల సంఘం అధ్యక్షురాలు బాలగోని భాగ్యలక్ష్మి రూ.1,000 అందజేసి అతడిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



అభివాదం చేస్తున్న జిల్లా ఇన్‌చార్జ్ కోటిరెడ్డి, ఎమ్మెల్యే రాజయ్య, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి తదితరులు

స్టేషన్‌ఘన్‌పూర్: 'నా ఊపిరి ఉన్నంతవరకు నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని, అభివృద్ధికి కృషి చేస్తానని' ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఉద్వేగంగా అన్నారు. బీఆర్‌ఎస్ సముద్రాల క్లస్టర్ ఆత్మీయ సమావేశాన్ని ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో సోమవారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. తెలంగాణలో హనుమంతుడి గుడి లేని ఊరు లేదని, అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు పొందని ఇళ్లు లేదన్నారు. ఊపిరి ఉన్నంత వరకు ప్రజాసేవ చేస్తానని, నియోజకవర్గమే దేవాలయం, ప్రజలే తన దేవుళ్లని సభావేదికపై మోకాళ్లపై ఉండి ఉద్వేగంగా అన్నారు.

కడియం శ్రీహరిని ఆహ్వానించాం..

ఆత్మీయ సమావేశం గురించి ఎమ్మెల్సీ కడియం శ్రీహరికి జిల్లా ఇన్‌చార్జ్ కోటిరెడ్డి, జెడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి సమక్షంలో ఫోన్ చేసి ఆహ్వానించానని, అయితే నల్గొండ జిల్లాకు ఆత్మీయ సమావేశాలకు కడియం ఇన్‌చార్జ్‌గా ఉండటంతో రాలేకపోయారని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

మాట జారిన ఎమ్మెల్యే..

బీఆర్‌ఎస్సే కాంగ్రెస్, కాంగ్రెస్సే బీఆర్‌ఎస్ అంటూ ఎమ్మెల్యే మాట జారారు. తాను అధికార కాంగ్రెస్ పార్టీ పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి టీఆర్‌ఎస్‌లో చేరానని, ఆ సమయంలో చాలా మంది కాంగ్రెస్ శ్రేణులు తనతో టీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. ఇప్పుడు ఎక్కడా కాంగ్రెస్ లేదని, ముందు చూసినా, వెనుక చూసినా, అటు చూసినా, ఇటు చూసినా బీఆర్‌ఎస్సే ఉందని, బీఆర్‌ఎస్సే కాంగ్రెస్, కాంగ్రెస్సే బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్సే కేసీఆర్ అంటూ వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

బీజేపీ, కాంగ్రెస్ నిస్సహాయ స్థితిలో ఉన్నాయి : కోటిరెడ్డి

రాష్ట్రంలో బీజేపీ నామమాత్రంగా ఉందని, కాంగ్రెస్ నిస్సహాయ స్థితిలో ఉందని ఆత్మీయ సమావేశాల జిల్లా ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి అన్నారు. తెలంగాణలో, దేశంలో బీఆర్‌ఎస్‌కు పోటీలేదని, ఓటుకు నోటు కేసులో అరెస్టయి సోనియాగాంధీని విమర్శించిన రేవంత్‌రెడ్డిని టీపీసీసీ అధ్యక్షుడిని చేశారని ఎద్దేవా చేశారు. బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్‌కు సభ్యతగా మాట్లాడడమే రాదని విమర్శించారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే సతీమణి ఫాతిమామేరి, జెడ్పీటీసీ మారపాక రవి, ఎంపీపీ కందుల రేఖ, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, ఘన్‌పూర్ సర్పంచ్ సురేష్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేష్, అధికార ప్రతినిధి శ్రీరాములు, ఎంపీటీసీ ఎస్.దయాకర్, చల్లా చందర్‌రెడ్డి, కె.మనోజ్‌రెడ్డి, తోట సత్యంతోపాటు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరుపై హర్షం



కొడకండ్ల: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొడకండ్ల: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో బంజార భవన్‌ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం పట్ల గిరిజన నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం నీలిబండతండాలో సీఎం కేసీఆర్, మంత్రులు దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఇందులో భాగంగా పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో నిర్మించే బంజారా భవన్‌కు కూడా రూ.2 కోట్లు మంజూరవడం ఆనందంగా ఉందని గిరిజన నాయకులు తెలిపారు. ఎంపీపీ జ్యోతి, గిరిజన నాయకులు అభిమన్‌గాంధీ, రవిరాథోడ్, రాగ్యానాయక్, రాజ్‌కుమార్, విమల, రాములు, మహేష్, మంగ్యానాయక్, బాలోజీ, తుకారాం, సోమాని తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సంక్షేమానికి కృషి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో సీఎం కేసీఆర్ గిరిజనుల సంక్షేమానికి ప్రత్యేక చొరవతో పనిచేస్తున్నారని రఘునాథపల్లి వైస్ ఎంపీపీ బీక్కూనాయక్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు రాజేష్‌నాయక్ అన్నారు. డివిజన్ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మాజీ ఉపముఖ్యమంత్రి, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి గిరిజనుల కోరిక మేరకు నియోజకవర్గానికి రూ.2 కోట్లతో బంజార భవన్‌ను మంజూరు చేయించారన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎస్టీ నాయకులు భూక్య సంజీవనాయక్, వెంకటేశ్వర్లు, కెతావత్ నర్సింహ, రూప్లానాయక్, సక్రునాయక్, రవినాయక్, నర్సింహ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాలకుర్తి: బంజార సేవాలాల్ భవన నిర్మాణానికి రూ. 4 కోట్లు నిధులు మంజూరు చేయడం పట్ల సీఎం కేసీఆర్, రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. రాజీవ్ చౌరస్తాలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో నిధులు మంజూరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. సంఘం అధ్యక్షుడు డాక్టర్ రవి రాథోడ్, దేవానాయక్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'భూములు లాక్కోవాలని చూస్తున్నారు'



మాట్లాడుతున్న జాయా మల్లేషం

జనగామ: బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు అధికారాన్ని అడ్డం పెట్టుకొని అమాయక ప్రజల భూములు లాక్కోవాలని చూస్తున్నారని కురుమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి జాయా మల్లేషం అన్నారు. మంగళవారం తరిగొప్పుల మండలంలోని సోలిపూర్ గ్రామ గొల్లకురుమలపై జెడ్పీటీసీ భర్త ముద్దసాని వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ అర్జుల మధుసూదన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు తాళ్లపల్లి పోషయ్య చేసిన దాడిని ఆయన ఖండించారు. సంఘం నాయకులు బిక్క బీరప్ప అధ్యక్షత ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారంతో గుండాల్లా ప్రవర్తించి కురుమల మీద దాడికి పాల్పడ్డారని అన్నారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బోరెల్లి సిద్దులు, నోముల సోమయ్య, ఐల శ్రీను, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

గిఫ్ట్ ప్యాకెట్ల పంపిణీపై సమీక్ష

పాలకుర్తి టౌన్: రంజాన్ పండుగను పురస్కరించుకొని పాలకుర్తి మండలంలో నిర్వహించే ఇఫ్తార్ విందు నిర్వహణ, గిఫ్ట్ ప్యాకెట్లపై మంగళవారం ముస్లిం మతపెద్దలతో తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్ మట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రంజాన్ పండుగను అత్యంతవైభవంగా నిర్వహించేందుకు కృషి చేస్తోందని అన్నారు. తహసీల్దార్ భూక్య పాల్‌సింగ్, మండల కో ఆప్షన్ ఎండీ సర్వర్ ఖాన్, మత పెద్దతలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి



రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య బృందం

నర్మెట: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఫైలేరియాను అరికట్టడంలో ప్రజలు నడుంబిగించాలని ప్రోగ్రాం అధికారి డా.కరుణాకర్ రాజు పిలుపునిచ్చారు. మైక్రో ఫైలేరియా నైట్ బ్లడ్ సాంపిల్ సేకరణలో భాగంగా సోమవారం రాత్రి మండలకేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి పర్యటించిన ఆయన పలు సూచనలు చేశారు. దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా వ్యాప్తిచెందుతుందని, ఇంటిపరిసరాల్లో, రహదారుల వెంట మురుగు నీటి నిల్వలు లేకుండా చేయాలని అన్నారు. నీటి నిల్వఉన్న ప్రదేశాల్లో కిరోసిన్ వెదజల్లడంతోపాటు ఇంట్లో దోమతెరలను వాడాలని సూచించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి 270 మంది నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డా. కిషోర్, సబ్ యూనిట్ అధికారి టి. రవిందర్, ఎల్‌టీ ఎ.మల్లయ్య, హెచ్‌ఎస్ ఎన్. శ్రీను, హెచ్‌ఏలు ఎం.వేణు, స్వాతి, శ్రీను, శ్యాం, ఏఎన్‌ఎం కరుణ, ఆశాలు మంగమ్మ, శ్వేత, చంద్రకళ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న కుమార్

రఘునాథపల్లి: రెండు దశాబ్దాలుగా చాలీ చాలని వేతనాలతో మహిళా సంఘాల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తున్న వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కొడిదేటి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వీఓఏల శ్రమదోపిడి చేస్తున్న ప్రభుత్వ వైఖరిపై మండలంలోని కంచనపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద సంఘం నాయకులు నాల్కపల్లి ఐలేశ్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ మహిళా సంఘాల స్థిరత్వం, సమాజాభివృద్ధి కోసం పని చేస్తున్న వీఓఏలపై ప్రభుత్వం వివక్ష చూపడం తగదన్నారు. గుగులోతు వీరన్న, కొన్నె వెంకటస్వామి, కందుకూరి యోనా పాల్గొనగా వారికి వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి కుమార్, సుంసు సురేందర్, తాళ్లపల్లి ఎల్లయ్య సంఘీబావం తెలిపారు.

సీపీఆర్‌తో ప్రాణాలు రక్షించవచ్చు



అవగాహన కల్పిస్తున్న సిద్ధార్థరెడ్డి

బచ్చన్నపేట: మనిషి ఛాతి నొప్పితో బాధపడుతున్న సమయంలో సకాలంలో స్పందించి సీపీఆర్ చేస్తే ప్రాణాలను కాపాడవచ్చని మండల వైద్యాధికారి సిద్దార్థరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, ఏఎన్‌ఎంలు, గ్రామ పంచాయతీ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు షబ్బీర్, సర్పంచ్ వడ్డెపల్లి మల్లారెడ్డి, వైద్యులు హరికృష్ణ, రాజబాబు పాల్గొన్నారు.

మామిడిలో సూటీమోల్డ్ తెగులు



మామిడి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి లత



నల్లబడిన మామిడి కాయలు

లింగాలఘణపురం: పూత దశలో సస్యరక్షణ చర్యలు చేపట్టని మామిడి తోటల్లో కాయలు ప్రస్తుతం నల్లబడి పురుగులు పడుతున్నాయి. కోత దశకు వచ్చే సమయంలో కాయ నల్లబడడంతో ఎందుకు పనికిరాకుండా పోతున్నాయి. మండలంలోని దయ్యాల సత్యనారాయణ ఐదు ఎకరాల మామిడి తోటలో కాయలన్నీ నల్లబడిపోయాయి. ఈ విషయమై ఉద్యానవన శాఖ జిల్లా అధికారి లత మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పూత దశలో తగిన సస్యరక్షణ చర్యలు తీసుకోకపోవడంతోనే నేడు కాయలు ఇలా నల్లబడుతున్నాయని తెలిపారు. అందుకు ఒక కిలో మైదా పిండికి ఐదు లీటర్ల నీటిని కలిపి మరగించిన అనంతరం 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. అక్కడక్కడా మంచిగా ఉన్న కాయలకు ప్లాస్టిక్ బ్యాగులను తొగిడి రక్షించుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు, వాతావరణంలో మార్పులతో కూడా మామి తోటలు దెబ్బతింటున్నాయని వివరించారు. తోటను పరిశీలించిన వారిలో హెచ్ఓ ధీరజ్ ఉన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

బచ్చన్నపేట: పడమటికేశ్వాపూర్‌లో వాస్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేడు (బుధవారం) ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ నిడిగొండ నరేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ వైద్యశిబిరంలో ఊపిరితిత్తులు, శ్వాస సంబంధిత పరీక్షలు నిర్వహించి, మోకాళ్ల నొప్పులు, దంత, కంటి పరీక్షలను చేసి అవసరమున్న వారికి ఉచిత మందులు, అద్దాలను అందించనున్నట్లు తెలిపారు. వైస్ చైర్మన్ నూకల భాస్కర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఇప్పలగడ్డలో 'కంటి వెలుగు'

నర్మెట: మండలంలోని ఇప్పలగడ్డలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ నీరటి రాణి సుధాకర్ మంగళవారం ప్రారంభించారు. బుధవారం సైతం శిబిరం కొనసాగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల వైద్యాధికారి కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో టీం లీడర్ డా.ఝాన్సీ, హెచ్ఎస్ భాగ్యమ్మ, ఆప్తో మెట్రిస్ట్ కరుణాకర్, డేటా ఆపరేటర్ ముజమ్మిల్, ఏఎన్ఎం విజయశాంతి, సరిత, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష నాయకులు బెడదం సుధాకర్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'కంటి వెలుగు'ను వినియోగించుకోవాలి



శిబిరాన్ని పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రావు

పాలకుర్తి: దృష్టి లోపాలు నివారించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జెడ్పీ ఫోర్ లీడర్ పుస్కురి శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని తీగారంలో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన పరిశీలించారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మదార్, సర్పంచ్ పోగు రాజేశ్వరిశ్రీనివాస్, వైద్యులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో బీజేపీని విస్తరించాలి



దేవరుప్పుల: మాట్లాడుతున్న పాపారావు

దేవరుప్పుల: పల్లెల్లో బీజేపీని విస్తరించేందుకు పార్టీ శ్రేణులు పాటుపడాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ పోనుగంటి పాపారావు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యాలయంలో బూత్ స్వశక్తికరణ్ సన్నాహక సమావేశానికి పార్టీ మండల అధ్యక్షుడు బాగాల నవీన్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి చేపట్టిన పలు సంక్షేమ పథకాలపై విస్తత ప్రచారం చేపట్టాలన్నారు. రాష్ట్ర నాయకుడు లేగ రాంమోహన్‌రెడ్డి, పెద్దగోని సోమయ్య, పాలకుర్తి నిజయోకవర్గం కన్వీనర్ పూసల శ్రీమాన్, కో కన్వీనర్ సుంకరి కోటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సోడ రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు దుబ్బ రాజశేఖర్, దొంగరి మహేందర్, జిల్లా అధికార ప్రతినిధి చింత సృజన్, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాజు, కన్వీనర్ రామారావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి



బచ్చన్నపేట: బూత్ కమిటీ పత్రాలు అందజేస్తున్న సోమిరెడ్డి

బచ్చన్నపేట: ప్రధాని నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సద్ది సోమిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఇటుకాలపల్లిలో 118, 119 బూత్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కమిటీనే కొనసాగిస్తున్నామని పార్టీలో సంస్థాగత నిర్ణయంపై మార్గనిర్దేశం చేశామని, కార్యకర్తలు పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. సర్పంచ్ ముక్కెర కరుణాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు ఉమ్మెంతల మల్లారెడ్డి, బూత్ అధ్యక్షులు మడేల్‌పాటి రమేష్, మ్యాక వెంకటేష్, నాయకులు ఇండ్ల సురేందర్, గడ్డం కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

'ప్రశ్నపత్రాల లీకేజీలతో చెలగాటం తగదు'

పాలకుర్తి టౌన్: నిరుద్యోగులు, విద్యార్థుల భవితను తేల్చే పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీలతో తెలంగాణ ప్రభుత్వం చెలగాటం తగదని బీజేపీ రాష్ట్ర నాయకులు లేగ రాంమోహన్‌రెడి, పెద్దగోని సోమయ్యగౌడ్ విమర్శించారు. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు కమ్మగాని శ్రీకాంత్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్, దుబ్బ రాజశేఖర్ గౌడ్, నియోజకవర్గం కన్వీనర్ పూసాల శ్రీమన్, జిల్లా నాయకులు చిలువేరు కృష్ణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి చౌడ రమేష్, ఆయా మండలాల బాధ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు మొక్కులు



ముత్యాలమ్మ పండుగలో జంగా రాఘవరెడ్డి, లక్ష్మీనారాయణనాయక్

దేవరుప్పుల: గిరిజనుల శ్రమలోనే ఆధ్యాత్మికత భక్తి ఇమిడి ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా తాజా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లకావత్ లక్ష్మీనారాయణనాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని మాధాపురం రెవెన్యూ పరిధి లాకావత్‌తండాలో దుర్గామాత ఉత్సవాలను పురస్కరించుకొని గిరిజనులు ఇంటింటా ముత్యాలమ్మ పండుగను నిర్వహించి ఇలవేల్పులకు మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ ధన్వంతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, జగన్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ పూజలు



పూజలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు

రఘునాథపల్లి: మంగళిబండతండా కొత్తగూడెం ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమాన్ మాలధారులు అత్యంత భక్తి శ్రద్ధలతో హనుమాన్ పూజలు చేశారు. మాలధారణ చేసిన హనుమాన్ స్వాముల జై హనుమాన్ జై జై హనుమాన్ నామస్మరణలతో ఆలయం హోరెత్తింది. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంకీస్ పద్మప్రకాష్‌రెడ్డి, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దల్ వ్యవస్థ ప్రముఖ్ పడకంటి రవీందర్, ఆలేటి సురేందర్‌రెడ్డి, భూక్య శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన సభకు స్థల పరిశీలన



చిల్పూరు: స్థల పరిశీలన చేస్తున్న జెడ్పీ చైర్మన్

చిల్పూరు: మండలంలోని చిన్నపెండ్యాలలో రేపు (గురువారం) నిర్వహించబోయే బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన సభ కోసం మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గురువారం నిర్వహించే సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరవుతారని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మామిడాల లింగారెడ్డి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, పార్టీ మండల, రమేష్‌నాయక్, హరిబాబు, రంగు హరీష్, రాజన్‌బాబు, వెంకటస్వామి ఉన్నారు.

విజయవంతం చేయండి

జఫర్‌గఢ్: ఈ నెల 7న హిమ్మత్‌నగర్‌లో నిర్వహించనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ రడపాక సుదర్శన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జరి రాజు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌లో పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇల్లందుల శ్రీనివాస్, జ్యోతి యాకయ్య, ఇల్లందుల మొగిళి, సర్పంచ్‌లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడగళ్ల వర్షానికి పంట నష్టం



రాలిన వడ్లు

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె, రామచంద్రాపూర్, ఇటుకాలపల్లి, నక్కవానిగూడెం, బచ్చన్నపేట గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కురిసిన వడగళ్ల వర్షానికి చేతికి వచ్చిన పంటలు దెబ్బతిన్నాయి. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి వరి చేలలో వడ్లు రాలిపోయాయి. అలాగే ఈదురుగాలులకు మామిడి కాయలు కూడా రాలిపోయాయి. ఆరుగాలం కష్టించి పంటలు చేతికి వచ్చే దశలో వడగళ్ల వర్షం కురిసి పంటలను నష్టపోవడంతో వ్యవసాయ అధికారుల చేత పంటలను సర్వే చేయించి పరిహారాన్ని ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.